# మా అల్లుడు

"ఏయ్, బజారుకు వెడుతున్నాను" అని కేక వేసి నేను బయటికి వెళ్ళటానికి సిద్ధమైనాను.

కాంతం అప్పటికే స్నానంచేసి మంచిబట్ట కట్టుకొని తలలో పూలుపెట్టుకొని తులసిపూజ చేసుకొన్నది.

"ఒక్కనిమిషం ఉండండి. వస్తున్నా" అని కేక వేసింది. ఒక్కనిమిషంలోనే వచ్చింది.

నల్లభై ఏండ్లమనిషి అయితే మటుకేం! దబ్బపండు లాంటిముత్తయిదువ. ముఖాన దమ్మిడీ వెడల్పు కుంకుమబొట్టు, చెంపకు చేరడేసి కళ్ళు. నెరసిన చెంపలు. గులాబీరంగు చీర గట్టుకొని, మబ్బురంగు రవిక తొడుక్కొని ఉంది. ఆరుగురి పిల్లలతల్లి! ఆ మాతృమూర్తినిచూచి నేనొక్కడిని తప్ప, మిగిలిన లోకమంతా చెయ్యెత్తి నమస్కరిస్తుంది.

ఆవిడ వచ్చి అన్నది. "చూడండీ మీరు కూరలు తీసుకొని ఇక్కడున్నట్టు రావాలె. అక్కడ ఎవరితోనో మాట్లాడుతూ కూర్చుంటేకాదు. వింటున్నారా?" అన్నది.

"వింటున్నాను" అని తల ఊపాను.

"ఒక వీసెడు వంకాయలూ, అరవీసెడు బెండకాయలూ, పచ్చిమిరపకాయలూ, టొమాటోలూ" అని చెప్పుకు పోతున్నది.

"ఇవన్నీ కొంటే ఎంత అవుతుందో ఏమిటో ఏమైనా కొంచెం ఆలోచించావా?"

"ఎంత అయినా కానీయండి, ఏంజేస్తాం!" అన్నది ఆవిడ.

సరేనని కావలసిన డబ్బు జేబులో వేసుకొని గడప దిగబోతూఉంటే, "చూడండి, మీరు వెళ్ళే దార్లోనేగా, వున్నాయ ఇల్లు! ఒక శేరుపాలు పంపమని చెప్పండి" అన్నది.

సరేనని తలఊపి వీధిలో కాలుపెట్టాను. ఆవిడ మళ్ళీ నన్ను లోపలికి పిలిచి "చూడండి, వంకాయకూర అల్లుడు తినడట. అమ్మాయి చెబుతున్నది. క్యాబేజీ ఉంటే తీసుకు రండి.''

కూరలు ఎంత ప్రియంగా ఉన్నవో అవన్నీ తేవటం ఎంతకష్టమో ఆమెకేమీ తెలియదు. అల్లుడు వస్తేమటుకు మనతోపాటు తినిపోతాడు అనుకోక ఏమిటో ఈ హడావుడి! అనుకొన్నాను.

ఏం జేస్తాం! అల్లుడొస్తున్నాడు.

జేబులో ఉన్న అయిదు రూపాయల నోటుతీసి ఒక్క సారి దానివంక దీనంగా చూచి ఇది కాస్త సాయంత్రానికి కనపడదు, అని అనుకొని నడిచి పోతున్నాను.

ఇంతలో రాధాయ పరుగెత్తుకుంటూవచ్చి, రాత్రి కూరకు బంగాళా దుంపలూ, మధ్యాహ్నం పలహారం చేయ టానికి కాస్త సెనగపిండో, మైదాపిండో, తెమ్మన్నదనీ, పంచ దారకూడా తెమ్మన్నదనీ, చెప్పాడు.

ఏంజేస్తాం! అల్లుడొస్తుంటే! గబగబా నడిచి బజారుకు వెళ్ళాను.

## ౨

అరగంటలో నేను ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లో పెద్ద కేకలు వినిపిస్తున్నాయి.

ఆ తల్లి ఆ అమ్మాయిని కోప్పడుతున్నది. 'అదేమిటే, అమ్మాయీ, తలంటి పోసుకోమంటే బెల్లంకొట్టిన రాయి లాగా అల్లాగే కూర్చున్నావేనే! లే!'

రాధాయను కోప్పడుతున్నది – 'ఒరేయ్ వెధవా తొందరగా వెళ్ళమనలేదూ! బావ వచ్చేవేళ అయింది. వెళ్ళి, ఒకకట్ట తమలపాలుకులూ, కాసిని లవంగాలూ, ఏలకాయలూ, తీసికొని రమ్మని ఎంతసేపు అయిందిరా చెప్పి నీకు!'

నన్ను ఉద్దేశించి విసుక్కుంటున్నది – వెళ్ళిన మనిషి అక్కడే కూర్చున్నారు. ఇంతవరకు కూరలు ఇంటికి రాక పోయె! ఇంటిదగ్గర ఏమి కావలసివస్తుందో, తొందరగా వెళ్ళి దామని తోచవద్దూ ఆ మనిషికి! ఎబ్బే! ఏం మనిషమ్మా! ఎన్నాళ్ళు చెప్పుకొన్నా ఇదే వరస అయిపోయె!'

శాస్త్రితో అంటున్నది – 'ఆ పున్నాయ పాలు తేనే లేదు. వెళ్ళి తీసుకురారా. చెప్పి ఎంతసేపు అయిందిరా నీకు! కదలవేంరా! అబ్బ! చదివావులేరా! మాలావు చదువూ!'

మళ్ళీ అమ్మాయితో అంటున్నది–'తెమలవే అమ్మా, తెములు! తొందరగా కానిచ్చి, తలదువ్వుకొని తెల్లచీరకట్టుకో. పూలు తెమ్మనిచెప్పటం మరచిపోయినానేతల్లీ! నాకు బొత్తిగా మతిపోతున్నది, తెస్తారులే అంటావా! అయ్యో! అయ్యో! మీనాన్నకు అంతమాత్రం తెలిస్తే ఇంకేం! ఫలానివస్తువ

తెమ్మంటేనే తీసుకురారు! చెప్పకపోతే గ్రహించటం తెలుసూ! సరేగాని తల్లీ తొందరగా కానీయవే. ఆయన వచ్చిన తరువాత మొదలుపెడతావా సింగారం! బాగానే వుంది!'

చిన్న అమ్మాయితో అంటున్నది - 'ఏమేయ్ నీవు అట్లాగే ఉంటావా? ఎబ్బే. రాక్షసిలాగ. నీవుకూడా స్నానం చేసి కొత్తపరికిణా కట్టుకో.'

తనలో తాను అనుకొంటున్నది - 'నాకూ ఇప్పుడే వచ్చింది ఈ రోగం! నడుము పగలేసుకొని పోతున్నది. కూరలు ఇంకా రాకపోయె! ఆయన ఎప్పటికిరానూ! ఎప్పటికి వంటగానూ! అప్పుడే తొమ్మిది కావస్తుందె! అమ్మాయ్, మీనాన్న వస్తున్నారేమో చూడు. రావటం లేదు కదూ! అంతే! మనిషికి అవసరం తెలియకపోయె!'

పాపతో అంటున్నది - 'పాపా, నీవు అట్లా వీధి మొగ సాలకెళ్ళి చూడూ, మీనాన్న వస్తున్నారేమో!'

ఇల్లాగ తొక్కిసలాడుతున్నది!

ఏం జేస్తాం, అల్లుడొస్తుండె!!

# 3

'కూరలు తెచ్చానే' అంటూ నేను ఆమె ఎదుట బడ్డాను.

'మీ ఇల్లు బంగారం కానూ! ఇంత ఆలస్యం చేస్తే ఎల్లాగండీ. సరే ఇప్పటికైనా వచ్చారు!' అంటూ సంచి తీసుకొన్నది.

పున్నాయ పాలు తెచ్చింది!
రాధాయ తమలపాకులూ తెచ్చాడు!
అమ్మాయి కొత్తచీర కట్టుకొన్నది!
పాప కొత్తపరికిణా కట్టుకొన్నది.

ఆవిడ ముఖం వికసించింది. హృదయంలో పొంగి పొరలిన ఆనందం ముఖాన్ని అంతా కప్పినది. సంతృప్తి సూచకమైన నిట్టూర్పు విడిచింది ఆవిడ. ఆమె శుభమనస్సు తరళితం కాసాగింది. చంచలమైన ఔత్సుక్యంతో ఆమె అందరిని మెచ్చుకోసాగినది.

'మా తండ్రి మంచివాడమ్మా, ఎప్పటికైనా వీడే కాస్త అన్నంపెట్టేది!' అని రాధాయను మెచ్చుకొన్నది.

పాపను దగ్గరకు తీసికొని. 'నా బంగారు తల్లే' అని ముద్దాడి, 'ఓసేయ్ చూడూ, బావకు ఏమైనా కావలిస్తే నిన్ను పిలుస్తాడు గాని నీవు పెంకెతనం చెయ్యక, బావకు ఏం కావాలో కనుక్కొని నాకు చెబుతూ ఉండు అమ్మా!' అని బుద్ధులు చెప్పింది.

'ఒరే రాధిగా, బావ రావటంతోనే కాళ్ళు కడుక్కొనేందుకు నీళ్ళు నేనే ఇస్తానుగాని నీవు తువ్వాలు తీసుకెళ్ళి ఇయ్యేం!'

ఇల్లాగ అందరికీ అన్నిపనులూ చెప్పింది.

మధురమైన కంఠస్వరంతో పాటలు పాడుతున్నట్లు అంటూ ఉన్న ఈ మాటలన్నీ నేను మంత్రప్రభావంవల్ల స్మృతిహీనుడైన వాడిలాగ విన్నాను.

ఇంతకూ ఆమె నాకేమీ పని చెప్పలేదు.

'నేను ఏం జెయ్యాలే?' అని అడిగాను.

ఆమె నవ్వుతూ అన్నది, 'మీరేమీ చెయ్యనక్కరలేదు. ఊరుకొని నామీద కేకలు వెయ్యకుండా ఉంటే అదే పదివేలు,'

ఆసాయంగా ఆవిడ వంటఇంట్లోకి వెళ్ళిపోయింది, నేను రైలు స్టేషన్‌కు వెళ్ళాను.

౪

అల్లుడూ నేనూ బండి కట్టించుకొని వస్తున్నాము. ఇల్లు ఇంకా కాస్తదూరంగా ఉన్నది. ఇంతలో పసివాళ్ళు ఇద్దరూ పరుగెత్తుకుంటూ వచ్చారు. నేను బండి ఆపి వాళ్ళిద్దరినీ ఎక్కించుకున్నాను. బండి ఇంటిముందు ఆగటంతోనే వాళ్ళుదిగి లోపలికి పరుగెత్తుకొనిపోయి అమ్మకు చెప్పేశారు బావ వచ్చాడని!

మేము గడపలో కాలుపెట్టకముందే అల్లుడికి అత్తగారు కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు ఇచ్చి క్షేమసమాచారం అడిగింది.

రాధాయి తువాలా ఇచ్చాడు.

అల్లుడు కుర్చీలో కూర్చున్న తరువాత, నేను కాసేపు ఆ సంగతులూ, ఈ సంగతులూ అతనితో మాట్లాడినాను. పాపా, రాధాయి అతనిదగ్గరకు చేరారు. అతను వాళ్ళను ఏదో మాట్లాడిస్తున్నాడు. నేను అవతల గదిలోకి వెళ్ళాను ఏదో

పలిచూచు కొంటానికి. అల్లుడు వాళ్ళను ఏదో ప్రశ్నలూ వేస్తున్నాడు. 'మీ అన్న ఏం జేస్తున్నది?' 'మీ అన్నయ్య ఏం జేస్తున్నాడు?' అని అడిగి మాటలమధ్య 'మీ పెద్ద అక్కయ్య ఏం జేస్తున్నది?' అని అడిగాడు. ఆపళంగా వాళ్ళిద్దరూ ఒక్క గంతులో వంటఇంట్లోకి పరుగెత్తికెళ్ళి 'పెద్ద అక్కయ్య ఏం జేస్తున్నదే అమ్మా?' అని అడిగారు. 'ఎందుకు నాయనా' అన్నది ఆవిడ. బావ అడుగుతున్నాడని, ఇద్దరూ పెద్దగా చెప్పేశారు. ఆమె వాళ్ళనోరునొక్కి 'అరవకూడదురా బాబూ! మేడపైన గదిలో ఉన్నదని చెప్పు' అని పంపించింది.

భోజనం చేస్తూ ఉన్నంతసేపూ ఆవిడ అంటూనేఉన్నది. 'అయ్యో, ఇంత మొహమాటం ఏమిటండీ అల్లుడికి, బొత్తిగా తినడేం!' అని.

ఎల్లాగయితేనేం భోజనాలు అయిపోయినవి. 'మేడపైన గదిలో పక్క వేసి ఉంది. పడుకోపో నాయినా కాసేపు. రాత్రి నిద్ర లేనట్లున్నది.' అన్నది. ఆ అబ్బాయి నవ్వుకుంటూ పైకి వెళ్ళిపోయినాడు. తమలపాకులూ వక్కలూ అమ్మాయే తీసికెళ్ళి మొగుడికి ఇచ్చివచ్చింది.

ఆ తరువాత తల్లీకూతురూ కూర్చుని మాట్లాడు కొంటూ, నవ్వుకొంటూ భోజనాలు చేశారు.

కాలం వచ్చి నన్నొకసారి గదిలోకి రమ్మని పిలిచింది. నేను వెళ్ళాను. ఆవిడ నాకు దగ్గరగావచ్చి రహస్యంగాఅన్నది, 'చూడండి, అల్లుడు ఈ రాత్రికి ఉండి తెల్లవారుఝామున రైలుకు వెళ్ళిపోతాడట?'

"రేపు ఆఫీసుకు వెళ్ళాలి కామాలు, సెలవు పెట్టి రాలేదేమో!" అన్నాను.

"సెలవు పెట్టినా ఇవ్వరు టండీ?"

"సరే, ఏం జేస్తాం. పంపుదాము. అమ్మాయి పండగ వెళ్ళిందాకా ఉంటుందిగా?" అన్నాను తృప్తితో.

"అమ్మాయి వుంటుంది లెండి! ఆయనసంగతి!" అన్నది కాతర కంఠంతో.

"ఏంజేస్తాం?" అన్నాను.

"అదికాదండీ, ఆయనకూడా పండగదాకా ఉండి, కొత్తబట్టలు కట్టుకు పోతే నా ప్రాణం సంతోషిస్తుంది." అన్నది ఆవేదనతో.

క్రొత్తబట్టలూ అనేసరికి నాగుండెల్లో రాయిపడ్డది. ఈ రోజులలో క్రొత్తబట్టలు కొనటమూ అంటే ఇంనై ముప్పది రూపాయలు..అయినా ఖర్చు. పండుగకు ఉంటే ఎట్లాగూ క్రొత్తబట్టలు కొని ఇయ్యక తప్పదు అని ఆలోచించి "సరే అల్లుణ్ణి పండగదాకా ఉండమను" అన్నాను.

కాంతం నాకు మరీ దగ్గరకువచ్చి, పెద్ద రహస్యం చెప్పేపద్ధతిలో అన్నది. "అన్నానండీ! పండుగకు రమ్మని, అన్నాను. నాతో 'సెలవు ఇయ్యరండీ' అన్నాడు. అమ్మాయినికూడా అడగమన్నాను."

"అడిగిందా?"

"అడిగిందట. అడిగితే. పండుగకు ఒక్కరోజే సెలవు. రావటానికి వీలులేదు అన్నాడట?" ఆమె ఈ మాటలు నాకు దీనవదనయై చెప్పింది.

నేను అన్నానూ, "పోనీ, ఇంకో పండుగకు వస్తాడులే, సెలవు లేకపోతే ఎల్లాగ వస్తాడు?"

"అది కాదండీ, అమ్మాయీ అల్లుడూ ఇద్దరూ పండుగకు ఇంట్లోఉండి క్రొత్తబట్టలు కట్టుకొంటేనేగాని నా ప్రాణం సంతోషించదు."

నేను ఏమీ మాట్లాడలేదు.

ఆమె తన ఉద్దేశాన్ని నేను గ్రహించలేదన్న విసుగుతో అన్నది, "ఆ అబ్బాయి రాకపోతే ఎట్లాగండీ!"

ఎట్లాగో నాకూ ఏమీ తోచలేదు. రాకపోతే ఏం జేస్తాం! అనుకొని నేను ఏమీ మాట్లాడక ఊరికే ఆమెవంక చూస్తూ కూర్చున్నాను.

మళ్ళీ ఆవిడే అన్నది, "ఏమంటారూ!"

ఏమనాలె! అసలు ఏదో ఒకటి అనవలసిన అవసరం కూడా నాకేమీ కనపడలేదు. ఆయనగారు పండగకు రాకపోతే ఓపాతిక రూపాయలు ఖర్చు తప్పిపోతుందని నేను అనుకొన్నాను.

కాంతం నాకు దగ్గరగావచ్చి బుజంమీద చెయ్యివేసి, ఆదరంతో అన్నది. "నేను చెప్పేది ఏమిటీ అంటే పండగకు అల్లుడికి ఎట్లాగూ బట్టలు పెట్టవలసే ఉండె,....ఇప్పుడే..."

"ఓహో, మరీబాగుంది ఈ వ్యవహారం! రాకపోయినా బట్టలు ఏర్పాటు చేస్తే అన్ని పండగలకూ పోస్టు ద్వారా పంపవలసి వస్తుంది!" అన్నాను నేను నవ్వుతూ.

"ఏమి మాటండీ అవి! అన్ని పండుగలకు బట్టలు పంపుతారా ఏమిటి! పండుగకు ముందు వచ్చాడు కాబట్టే నే సనటం!"

"అయితే పండుగదాకా ఉండమని అను మర్యాదకు లోపం లేకుండా! ఆయన అంతగా ఉండకపోతే ఏం జేస్తాం, ఊరుకో."

కాంతానికి నాతో శాంతంగా వాదించే ఓపికపోయింది. "అవ్వ, నన్ను తగలెయ్య. ఊరుకొంటే మర్యాదగా ఉంటుం దంటారా! పండుగకు ముందు వచ్చిన అల్లుడికి బట్టలు పెట్టక పోతె బాగుంటుందా? మీరే చెప్పండీ!" అన్నది!

"నిజమే, ఏమీ బాగుండదు అన్న ఒక్క మాట తప్ప, ఇంకేమన్నా ఆమెకు కోపం వచ్చేలాగున్నది. అయినా నేను, ధైర్యంచేసి అన్నానూ, "అయితే నేను పండుగకు ముందు ఎన్ని సార్లు వచ్చాను మీపుట్టింటికి? నాకు మా అత్తగారు ఇట్లాగే బట్టలు పెట్టారా?"

"పెట్టకపోతే?" అన్నది ఆవిడ ఏదో అసందర్భపు మాటలు మాట్లాడుతున్న వాడిని చూచినట్లు చూస్తూ.

నేను మిథ్యాకోపాన్ని ప్రకటిస్తూ. "అప్పుడూ – ఈ తెలివి ఏమైపోయింది అంటా! మీనాన్నతో చెప్పి పెట్టించ లేకపోయినావూ!" అన్నాను గొంతు పెద్దదిచేసి!

కాంతం ముఖం ఇంత చేసుకొని "ఇప్పుడెందుకంటీ అడంతా! అయినా ఎప్పటి సంగతి చెప్పండి, అది!" అన్నది జాలిగా!

అయినా నేను ఊరుకోక 'ఇప్పుడు నీ కూతురు విషయం వచ్చేసరికి అన్ని మర్యాదలూ తెలిసొచ్చినయ్యేం!' అన్నాను.

కాంతం ఈ తగాదా ఎట్లాగ పరిష్కరించాలో అని ఒక్క నిమిషంలో ఆలోచించి పరిహాసమార్దవమైన కంఠంతో చిరునవ్వు నవ్వుతూ, 'చూడండి, నా కూతురి విషయంలో అన్ని మర్యాదలూ మీరు జరపండి. మీ కొడుకుకు మళ్ళీ ఇన్ని మర్యాదలూ జరిగేలాగున నేను చూస్తాను' అన్నది.

నేను ఇంకేమీమాట్లాడలేకపోయినాను. సంతోషంతో నే నలభైరూపాయలుతీసుకొని బజారుకు బయలుదేరాను.

నెల అంతా గడపటానికి అట్టిపెట్టుకొన్న డబ్బు అది! అదికాస్తా ఖర్చు అయిపోతే ఎట్లా గడవాలో ఆ భగవంతుడికే తెలియాలె.

ఏం జేస్తాం!

అల్లుడొచ్చాడాయె మరి!

కట్టుకొన్నబట్ట బొత్తిగా మాసింది. పెట్టెలోనుంచి తీసి ఇంకొకటి ఇయ్యమన్నాను ఆవిడను. ఆవిడ 'ఇదొక్కటే ఉన్నది. కాస్తచినిగినట్లుంది' అంటూ ధోవతి నాచేతికిచ్చింది. చూద్దునుగదా రూపాయి వెడల్పు చినుగు ఒకటి కనపడ్డది.

ఆ చినుగువంక చూస్తూ ఒకనిమిషం నిలబడ్డాను!!

ఆ పాతగుడ్డ నోరు తెరుచుకొని, నా దారిద్ర్యాన్ని ప్రపంచానికి చెబుతానని భయపెట్టింది!

ఏడిసింది. ఈ మాత్రానికి నేను భయపడుతానా! 'నేను క్రొత్తధోవతి కొనుక్కోలేనని నీకేం తెలుసు! ప్రపం

చానికి మటుకు ఏం తెలుసు. నోరుముయ్యి. ఆటే అరవకు' అన్నాను నేను వ్యథిత కంఠంతో.

ప్రపంచమంతా నోరు తెరుచుకొని చూచినా లెక్క-చేయ దల్చుకోలేదు నేను. సూదీ దారం తీసుకొని దాని నోరు కుట్టివేయటానికి ప్రారంభించాను.

ఆ చినుగు మాట్లాడింది. ఏమన్నది? 'కొత్త ధోవతి కొనుక్కో' అన్నది దీనంగా చూస్తూ. అంతకంటే ఏమీ అనలేదు అదైనా పాపం!

అయినా నాకు ఎందుకో కోపం వచ్చింది. 'ఛా, నోరు ముయ్యి. కొత్తగా ధోవతి కొనుక్కుంటానికి డబ్బు ఎక్క-డిది!' అంటూ దానినోరు గట్టిగా కుట్టేశాను. ఆ ధోవతి కట్టుకొని బజారుకు వెళ్ళాను.

బట్టలకొట్టు వర్తకుడు కూడా 'అల్లుడుగారికి పెట్టేవి కాస్త ఖరీదుగలవి అయి ఉండాలండి, లేకపోతే దర్జాగా ఉండ'దని చెప్పాడు. మన కుటుంబ గౌరవాన్ని కాపాడాలనే సదుద్దేశంతో, వాడు అల్లాగ చెబుతూ ఉంటే నేను ఎల్లాగ కాదనేది! నా ధోవతి చినుగుమాత్రం అతడు చూడకుండా జాగ్రత్తపడ్డాను. అల్లుడికి పెట్టవలసిన బట్టలు మంచివే కొన్నాను. అమ్మాయికి ఎట్లాగూ ఒకచీర కొనాలిసే ఉండె! దానికోసం ఇంకోసారి రావటం ఎందుకూ! ఒక మంచిచీర కూడా ఇయ్యమన్నాను. అంతా యాభై రూపాయల బిల్లు అయింది. నా దగ్గరఉన్న నలభై ఇచ్చి మిలిగిన దానికి పద్దు వ్రాయమంటే వాడి ధర్మాన ఒప్పుకొన్నాడు. నెలకు నూటికి రూపాయిన్నర వడ్డీ అని కూడా వ్రాశాడు. పోనీ ఏంజేస్తాము

సమయానికి అప్పుదొరికింది. అదే సంతోషము. అల్లుడికి బట్టలు పెట్టకపోతే ఎట్లా. సరే ఇంటికి వచ్చాను.

అప్పటికే అయిదు గంటలు అయింది. చీకటిపడ్డ తరువాత కొత్తబట్టలు కట్టుకోకూడదు. అందుకని అప్పుడే అల్లుణ్ణి పిలచి కొత్తబట్టలకు పసుపుపెట్టి ఆయనకిచ్చి కట్టుకోమన్నాము. ఆయన కట్టుకొన్నాడు. అమ్మాయి తలుపు పక్కన నుంచుని చూచి సంతోషించింది. ఆవిడా నేనూకూడా సంతోషించాము.

తెల్లవారుఝామున నాలుగింటికే లేపాను నన్ను. అంతకు ముందు మూడుగంటలకే అమ్మాయిలేచి తల్లిని లేపింది. ఇద్దరూ కలిసి వేడినీళ్ళు కాచారు. అయన ముఖం కడుక్కొని స్నానం చేశాడు. అల్లుడూ, నేనూ, అమ్మాయీ, పిల్లలూ అందరం కాఫీ తాగాము. పరితృప్తిత కాంక్షితమైన కాంతం మనస్సు, సంతోషంతో పొరలింది.

అల్లుడు బండి ఎక్కుతూ ఉంటే అమ్మాయి తల్లితో ఏమిటో-గుసగుసలాడింది. ఆవిడఅన్నది, "ఏమాత్రంవీలున్నా పండుగకు రా నాయినా, ఒక్కరోజు ఉండి వెళ్ళవచ్చు."

అమ్మాయి ఏమీ అనలేదు గాని ఆయనవంక ఏదో, దీనంగా చూచింది.

పాప,"బావా, పండగకు తప్పకుండా రావాలె"అన్నది.

పిల్లలు ఇద్దరూ, "తప్పకుండా రా బావా" అని చేతిలో చెయ్యి వేయించుకొన్నారు! వేశాడు కాని ఎట్లావస్తాడు. సెలవ దొరకదాయె! రా నని గట్టిగా అనలేక పోయినాడు.

బండి మలుపు తిరిగిందాకా నుంచుని ఇంట్లోకివచ్చేశాము.

## ౫

అప్పటికి బాగా తెల్లవారింది.

నేను, కాంతంతో అన్నాను "నలభై రూపాయలూ అయిపోయినవి, ఎట్లా గడవటం ?

"ఎట్లాగో గడుస్తుంది లెద్దురూ, బెంగబెట్టు కోకండి" అన్నది ఆవిడ.

బెంగఅంటే బెంగకాదూ, నాకు ఊరికే డబ్బు ఎక్కడ నుంచి అయినా వచ్చి పడుతుంది కనకనా! ఈ వెధవస్కూలు మాస్టరీ పనిలో జీతానికి వృద్ధి అంటూ లేదు. పై సంపాదన అసలే లేదు. నేను నా చిన్నతనంలో గనక తాలూకా ఆఫీసులో ప్రవేశించినట్లయితే ఈపాటికి డిప్యూటీ కలెక్టరు అయి కూర్చునే వాణ్ణి!

"పోనిద్దురూ, ఉన్న దాంతో సంతోషిద్దాము." అన్నది ఆవిడ.

ఆవిడ ఎప్పుడూ ఈమాటే అంటుంది. అందుకని నాకు ఒళ్ళు మండుకొచ్చి అన్నాను. "ఇదిగో! నీకు అల్లాంటి బుద్ధి ఉండబట్టే డిప్యూటీ కలెక్టరుగారి భార్య అయ్యే యోగ్యత నీకు లేకుండా పోయింది. తెలిసిందా ?" అన్నాను.

ఆవిడ ఏమీ మాట్లాడలేదు. అల్లుడొచ్చాడన్న సంతోషంతో ఆవిడ ఈమాటలు ఏమీ పట్టించుకోవటం లేదు. సంతోషాతిశయంతో ఆమె మనస్సు పురివిప్పి నాట్యం చేస్తోంది.

## ౬

పండగ రేపు. ఆ రోజున అందరూ కొత్తబట్టలు కట్టుకోవాలె. పాపకు పరికిణా చొక్కా క్రొత్తవే ఉన్నయి. పిల్లలకుకూడా ఇదివరలో కుట్టించిన వాటిలో ఈ పండుగకు అని అట్టి పెట్టినవి ఉన్నవి. అమ్మాయికి కొననే కొంటిని. ఎటొచ్చీ ఆవిడకు లేదు.

ఆవిడకు ఒక్కటైకూ లేకపోవటం ఏమని బజారుకెళ్ళి, ఆ కొట్లోనే పద్దు వ్రాయించి ఇంకో చీర తెచ్చాను.

పండుగ వచ్చింది. అంతా హడావుడిగా ఉన్నది. ఆవిడ వంట చేస్తున్నది. నేను మొత్తం అయినఖర్చు లెక్కజూస్తు న్నాను. రెండు చీరెలూ నలభై. అల్లుడికి పెట్టినబట్టల ఖరీదు ముప్పై రెండు. కూరలు మొదలైనవాటికి ఓ ఎనిమిది రూపాయలు అయింది. మొత్తము ఎనభై రూపాయలతో పండగ వెళ్ళేలాగున ఉంది.

పదిగంటలైంది. ఆవిడ అందరినీ అన్నానికి లెమ్మని అంటూఉన్నది. ఇంతలో ఇంటిముందు జట్కాఆగింది. పిల్లలు పరిగెత్తుకుంటూవచ్చి సంతోషంతో చెప్పారు బావవచ్చేడని!

"పండగరోజున ఎల్లాగో సెలవు సంపాదించి వచ్చావు నాయనా. చాలా సంతోషం" అని అంటూ ఆవిడ అల్లుడికి స్నానానికి నీళ్ళు తోడించింది అమ్మాయిచేత.

పండుగరోజున అల్లుడొచ్చాడని అంతా సంతోషించాము. భోజనాలు అయిపోయినవి.

పక్కమీద నడుం వాల్చాను. నాకో దిగులు పట్టు కొంది. నాలుగు గంటలకు అంతా కొత్తబట్టలు కట్టుకొంటారు గదా, ఆయన సంగతి ఏమిటీ అని!

ఇదివరలో బట్టలు పెట్టాముగదా, అవే తీసి ఈ సమ యానికి కట్టుకోమంటే బాగుంటుందా? అని ఒక ఆలోచన.

ఒకసారి పసుపుపెట్టి కట్టి విడిచిన ?ట్టలు మళ్ళీ కట్ట బెట్టటం ఏమిటీ అని మళ్ళీ ఇంకో ఆలోచన.

ఈ ఆలోచనలతో గుండె దడ ఎక్కువ అయింది.

మళ్ళీ కొత్తబట్టలు కొనుక్కు రావాలిసిందేనా? మొన్న ఇచ్చాముగదా అని ఊరుకోవలెనా? అబ్బ! ఏసంగతి తోచలేదు.

పండుగరోజున పిల్లలంతా కొత్తబట్టలు కట్టుకుంటూ
ఆయన ఏం చెయ్యాలె?

అరి బాబా! ఈ సమస్య తేలటం ఎల్లాగు!

పండుగముందు ఒకసారి బట్టలు పెడితే మళ్ళీ అదే పండుగకు, అదేమనిషికి బట్టలు పెట్టకూడదని ధర్మశాస్త్రంలో ఉన్నదని ఎవరైనా చెబితే బాగుండు!

ఇంతలో మా కాంతం వచ్చింది. నన్ను బాధపెడు తున్న సమస్యను గురించి సమగ్రంగా ఆమెకు చెప్పి ఇట్లా అన్నాను. "నేను డబ్బుకు పడుతూ ఉన్న ఇబ్బంది నీకు తెలియనిది కాదుకదా! మళ్ళీ ఇప్పుడు కొత్తబట్ట లుకొనటం కష్టం మరి ఏమంటావు?"

ఆవిడకూ ఏమీ తోచలేదు. నేను పడ్డ అవస్థలో ఆవిడా పడ్డది. ఒకక్షణం మౌనంగా ఉన్నది. ఆవిడకు ఏదో ఆలోచన వచ్చినట్లున్నది.

నోటిమీదుగా ఏమీ అనకపోయినా, ఆవిడ ఆంతర్యంలో ఉన్న విషయం ముఖంలో కనిపించే వ్యంగ్య పూర్వకమయిన నవ్వుతో నాకు స్పష్టమయినది.

నాకు భయం వేసింది.

ఏకోన్ముఖంగా ప్రవహించే నదికి దిక్కు అదిక్కు అన్న జ్ఞానం ఉండదు. అల్లాగే నా మనస్సు మార్గాప మార్గాలను గుర్తించే స్థితిలో లేదు. స్వార్థాన్ని అభిలషించి మంచిచెడ్డలను విస్మరించి నేను అన్నాను, "ఆయనకు కొత్తబట్టలు ఇయ్యలేము కాబట్టి మనం అంతాకూడా కొత్త బట్టలు కట్టుకోవటం మానేద్దామూ" అని!

ఈ పలుకులు ఆవిడ విన్నది మాట్లాడకుండా. ఆవిడ మనస్సు చివుక్కుమన్నది. ఆమె కంఠం చలించింది. కళ్ళు చెమ్మగిల్లినవి.

ఆమె ఇల్లాగ అన్నది, "అదేమిటండీ అల్లా అంటారూ! పుట్టింటికి వచ్చిన పిల్ల నిండుపండుగపూట క్రొత్తచీర కట్టుకోకుండా ఎట్లా ఉంటుందండీ?"

ఆమె కంఠస్వరములో స్నేహపూర్వకమైన ఆర్ద్రత ఉన్నది. కాని దెబ్బతిన్న మనస్సు పడేబాధ, అందులో సుశిక్షితుడైన గాయకుని గొంతులోని జీరవలె, గుప్తంగా ఉండి గుర్తింపతగినట్లుగానే ఉంది.

నేనూ విచారపడ్డాను. క్షమాపణ కోరుతున్న కంఠ స్వరంతో, "నీవు అంత ఇదాలా వెందుకు కాంతం, నీవు కష్టపడతానని గ్రహించకుండా ఆమాట అన్నాను. పొరపాటే. అయితే ఇంకోపని చేద్దాము" అన్నాను.

"ఏం చేద్దామంటారు!" అని అడిగింది ఆమె, కొత్త కంఠంతో. నేను చెప్పదల్చుకొన్నది వెంటనే చెప్పలేక పోయినాను. 'మరీ' అని, ఆగి కాస్తనవ్వి, ఆమె ప్రసన్నవదన అయిందో లేదో గమనిస్తూ, చివరకు, "చూడూ, మనం ఇదివరలో పెట్టామే; ఆ బట్టలనే తీసి, ఆయనను కట్టుకోమంటే, బాగుంటుం దంటావా?" అన్నాను.

ఆమె తల గిరగిరా త్రిప్పుతుందని నేను భయపడ్డాను గాని ఆమె అల్లాగ చేయక, ఆ గదినంతా ప్రకాశవంతం చేసేలాగున దరహాస వదనయై, "భేషుగ్గా ఉంటుందండి, దానికేం!" అన్నది.

ఆమె అల్లాగ అన్నప్పటికీ, నన్ను ఒక విషయం బాధిస్తూనే ఉన్నది అమ్మాయి ఏమనుకొంటుందీ అని! నా సందేహాన్ని గురించి నేను ఆవిడతో చెప్పాను.

"అది ఏమీ అనుకోదు. అయినా కనుక్కొని వస్తాను ఉండండి," అని చెప్పి ఆవిడ పక్కగదిలోకి వెళ్ళింది.

వెళ్ళి ఆవిడ అమ్మాయితో చాలాసేపు మాట్లాడుతూ కూర్చున్నది. నేను నా గదిలోనే దిగులుగా కూర్చున్నాను.

పదినిమిషాలు అయిన తరువాత కాంతం నాగదిలోకి అడుగులో అడుగు వేసుకొంటూ వచ్చి, చిక్కని కంఠంతో

నాముందు నిలబడి అనురాగ కంఠంలో అన్నది, "మనం పెట్టిన బట్టలు ఆయన తీసుకొని రాలేదటండి! అమ్మాయి ఆయనగారి పెట్టెఅంతా వెతికి చూచి చెప్పింది."

నా ముఖం తెల్లబడిపోయింది. అప్పుడు నా ముఖం చూస్తే ఎవరికైనా జాలివేసేది. కాని కాంతం మటుకు ఏమీ జాలిపడ్డట్లు కనుపించలేదు.

ఆశ్చర్య స్తబ్ధమైన కంఠంతో నేను అప్పుడు అన్నాను, "మరి ఏం చెయ్యాలె ఇప్పుడు!"

ఆమె ఏమీ మాట్లాడలేదు. నా హృదయ గతమైన భావాలను తెలుసుకొందామని ప్రయత్నం చేస్తున్నదా అన్పించింది. ఆ విధంగా చూస్తూ నా ఎదుట నిలబడి ఉన్నది.

న్యాయాధికారి నేరస్థుడికి పదిసంవత్సరాలు కఠినశిక్ష వేశానని చెప్పిన తరువాత వాడు ఏవిధంగా మ్లానముఖంతో దిగాలపడి చూస్తాడో అల్లాగ చూశాను నేనూ ఆమెవంక.

ఇక ఆమె ముఖతః వినవలసిన అగత్యముకూడాలేనట్లు తోచింది. ఇంకెందుకూ ఆమె చిరునవ్వే చెబుతున్నది. "ఏం జేస్తాము. మళ్ళీ కొత్తబట్టలు కొనుక్కొనిరండి తప్పదు." అనే ఉపనిషద్వేదాంతాన్ని బోధిస్తున్నవి ఆమె హాస రేఖలు.

సరేననుకొని మళ్ళీ బజారుకు వెళ్ళి పద్దు వ్రాయించి అల్లుడికి బట్టలు కొనుక్కొని వచ్చాను.

సాయంత్రం నాలుగు గంటలు అయింది! మధ్యాహ్నపు ఫలహారాలు అయిపోయినవి. కాంతం కాళ్ళకు పసుపు

పూసుకొని, ముఖాన వెడల్పైన కుంకుమబొట్టు పెట్టుకొని మెడకు కొద్దిగా గంధం పూసుకొని, కొత్తచీరగట్టుకొని నాగదిలోకి వచ్చింది. ముఖం వంచుకొని, మందహాసం చేస్తూ, నాకు పాదాభివందనంచేసింది. ఆమె ముఖంలో ఋషి పత్నుల లజ్జామధుర సౌందర్యం భాసించింది.

నేను తృప్తితో ఆమెను నఖశిఖ పర్యంతం నాచూపులతో తాకి చూశాను. నా హృదయం ఆనంద ప్లావితమయింది.

మధుర కంఠంతో అన్నది ఆవిడ "ఈ చీర చాలా బాగుందండీ" అని. నేను చిరునవ్వుతో సమాధానం చెప్పాను "ఈ చీర ఏ మిటి, ఏచీరఅయినా బాగుంటుంది నీకు."

స్నేహామార్దవమైన మధుర కంఠాన్ని సవరించుకొని ఆవిడ, "అల్లుడికి కూడా కొత్తబట్టలు ఇయ్యండి" అన్నది. నేను అల్లుడికి కొత్తబట్టలు కట్టబెట్టాను.

నేను కాంతం వంకచూస్తూ కూర్చున్నాను. ఆమె మధురభావమూర్తియై నా ఎదుట కూర్చున్నది. అప్పుడు ఆమె అప్సరో నవ్య శృంగార మధురాపాంగ. ఆ ఆపాంగాంత కాంతి రేఖా వివృత హృదయగత మధుశోభను, తిలకిస్తూ, ఆ దివ్యమూర్తిని ఆరాధిస్తూ నేను ఎంతసేపు కూర్చున్నానో తెలియదు.

ఇంతలో చిన్న పిల్లలు నలుగురూ క్రొత్తబట్టలు కట్టుకొని, నవ్వులు ఒలకబోస్తూ వచ్చి నాపాదాలు ముట్టుకొని నమస్కరించారు.

నా హృదయం ఆనంద తరంగితమైనది. పెద్దతల్లి రాలేదు. "అది ఇంకా క్రొత్తబట్ట కట్టుకోలేదేం?" అన్నాను. ఆమె నవ్వి ఊరుకొన్నది.

ఆ నవ్వు మనోహరంగా ఉంది. ఆ నవ్వు ఆమె ఇల్లాలితనమును, సౌశీల్యమును వినయాది సద్గుణములను వెల్లడించునట్టిదై ఉన్నది.

ఆ నవ్వు ఎంత అందంగా ఉంది! నిండి తొణికిసలాడు చెరువులో విచ్చి వికసించిన కలువ పూవుకు ఆ అందము లేదు. నోరంతయూ తెరచి పకపక నవ్విన బొడ్డుమల్లె పువ్వునకూ ఆ అందము లేదు.

ఇంతలో పెద్దతల్లీ అల్లుడూ, ఇద్దరూకూడా క్రొత్త బట్టలు కట్టుకొని, నూతన వధూవరులవలె, సిగ్గుతో ఒయ్యారంగా నడుస్తూ నా గదిలోకివచ్చి, ఒకేసారివంగి నాపాదాలు ముట్టుకొని సమస్కరించారు.

పిల్లలందరూ ఆమె చుట్టూ చేరారు. పసివాళ్ళు ఇద్దరూ తల్లికి ఇరుప్రక్కల చేరి ఆమె ఒడిలో ఒదిగి కూర్చున్నారు. పెద్దపిల్లలు ముగ్గురూ ఆమెను ఆనుకొని నుంచున్నారు. ఆనంద తరంగములు గదిలో నలుదిక్కుల విశ్వాత్కాంతుల వలె ప్రవహించినవి. మధువేళా సమస్త శోభాభాసితమైన మావి గున్నవలె కాంతం పిల్లలమధ్య కూర్చున్నది.

ఆమె మహోత్సాహంతో, కృతజ్ఞతా మధురాపాంగయై, అవనత ముఖయై, లజ్జారుణ కపోలయై మూర్తీభ

వించిన ప్రేమ దేవతయై అనిర్వచనీయమైన ఆనందంలో ఓల లాడుతున్నది.

అప్పుడు ఆమె, స్వర్గలోక నందనవన సమీపమున మందాకినిలో వికసించిన బంగారు తమ్మిపూవు.

సకల సౌరభోపేతమైన మల్లెపూలమధ్య మిలమిల మెరుస్తూ ఉన్న, నవకోమల పారిజాత ప్రసూనం. అనూహిత మైన స్వర్గసౌఖ్యమును అనుభవించిన పరితృప్తి తరతరాల ఆర్య సీమంతినుల హృదయంలో గుప్తంగా దాచుకొన్న, దాంపత్య జీవిత మధురిమమూ, ఆమె కన్నులలో గోచరిస్తూ ఉన్నవి.

ఋషి పుంగవులు ఏళ్ళతరబడి తల క్రిందుగా తపస్సు చేసినా లభ్యం కాని బ్రహ్మానందాన్ని, గృహస్థ జీవితంలో నాకు ప్రసాదించిన, కాంతాన్ని కృతజ్ఞతతో, చూచి, ప్రసన్నుడనై మనస్సులో ఆమెకు నమస్కరించు కొన్నాను.

ఇట్టి ఆనందాన్ని పొందటానికి గృహస్థు ఎటువంటి త్యాగాన్ని అయినా చేయటానికి సంసిద్ధుడే కదా అనిపించింది.

స్వర్గానికి వెళ్ళినా, ఆ ఆనందములో నూరోవంతు అయినా పొందజాలము అని నాకు ఆ క్షణంలో తోచింది.